
సాక్షి
కామారెడ్డి
శనివారం : 15 : మార్చి : 2025



మౌలిక వసతులేవి?

బాన్సువాడలోని పలు కాలనీలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో ▸



గరిష్ఠం/కనిష్ఠం
38.8 /19.3

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.



జిల్లా కేంద్రంలోని వీధుల్లో చిన్నారుల సంబురాలు

● హోలీ ఆనందాల కేళి

జిల్లాలో శుక్రవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రజలు ఉత్సాహంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

న్యూస్‌రీల్

నిజాంసాగర్ నుంచి నీటి విడుదల ప్రారంభం

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు శుక్రవారం ఐదో విడత నీటి విడుదలను ప్రారంభించారు. ప్రాజెక్టు ఆయకట్టు కింద 1.25 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో నీటిని అందించారు. ఐదో విడతలో రోజూ వెయ్యి క్యూసెక్కుల చొప్పున నీటిని అందించనున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 1,396.92 అడుగుల (8.351 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టునుంచి నీటిని విడుదల చేస్తున్నందున ప్రధాన కాలువలోకి ఎవరూ వెళ్లవద్దని అధికారులు కోరారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులకు సూచించారు. ఆయకట్టు కింద సాగు చేసిన ప్రతి గుంటకు సాగు నీరు అందించి పంటలను గట్టెక్కిస్తామని పేర్కొన్నారు.

నేడు శ్రీసిద్ధరామేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం




భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరులోని శ్రీసిద్ధరామేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. 19వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ విషయాన్ని ఆలయ ఈవో శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం వేకువజామున గణపతి పూజ, అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అఖండ దీపారాధన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, శ్రీసిద్దగిరి సమాధి వద్దకు ఊరేగింపు ఉంటాయని తెలిపారు. ఆదివారం ప్రత్యేక పూజలతోపాటు ఎడ్ల బండ్లతో ఆలయ ప్రదక్షిణ, అర్ధరాత్రి వీరభద్ర ప్రస్తావన, సోమవారం శ్రీసిద్దగిరి సమాధి వద్ద పూజ, స్వామివారి కల్యాణం, స్వామివారి విమాన రథోత్సవం, మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలు, బుధవారం శ్రీసిద్దగిరి సమాధి వరకు పల్లకీ సేవ, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు ఉత్సవాలలో పాల్గొనాలని కోరారు.

సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి



లింగంపేట: సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని బంజారా సేవా సంఘ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన గిరిజన నాయకులు శుక్రవారం లింగంపేటలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ ఫిబ్రవరి 15న జన్మించారన్నారు. ఆయన 286వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపాలని కోరారు. లింగంపేట మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో ఈనెల 18న సేవాలాల్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘ్ జిల్లా ఇన్‌చార్జి సురేందర్, మండల అధ్యక్షుడు గన్యానాయక్, ప్రతినిధులు ప్రకాష్, లింబేష్, సర్దార్, పరశురాం, వినోద్, దశరథ్, ఫూల్‌సింగ్, మోతీరాం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందేదెప్పుడో?



ఉద్యోగ విరమణ పొందిన తర్వాత వచ్చే మొత్తాన్ని లెక్కలేసుకొని.. ఇంటి నిర్మాణం, శుభకార్యాలు తదితర అవసరాల కోసం ప్రణాళికలు రూపొందించుకున్నవారి పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా తయారైంది. రిటైరయ్యి నెలలు గడుస్తున్నా ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందక జిల్లాలో 200 మందికిపైనే ఇబ్బంది పడుతున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరగా అందించాలని కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- ఏడాదిగా ఉద్యోగ విరమణలు
- నెలలు గడుస్తున్నా అందని బెనిఫిట్స్
- ఇబ్బందిపడుతున్న విశ్రాంత ఉద్యోగులు

ఉద్యోగంలో చేరిననాడే ప్రతి ఉద్యోగికి తాను ఏరోజు ఉద్యోగ విరమణ చేసేది తెలిసిపోతుంది. రిటైరయ్యేకన్నా ఏడాది, రెండేళ్ల ముందు నుంచే వచ్చే సొమ్మును ఎలా వినియోగించుకోవాలన్న దానికి లెక్కలు కూడా వేసుకుంటారు. పిల్లలు ఉద్యోగాలు, వ్యాపారాల్లో సెటిల్ అయి ఉంటే ఇబ్బంది లేదుగానీ, పిల్లలు స్థిరపడని పరిస్థితుల్లో తన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో కొడుకు, కూతుళ్లకు ఏదో ఒక దందా పెట్టించాలని ప్లాన్ చేసుకుంటారు. కాగా పదవీ విరమణ సమయానికి కొన్ని నెలల ముందుగానే తాము రిటైర్ కాబోతున్నట్లు అకౌంటెంట్ జనరల్(ఏజీ) కార్యాలయానికి పూర్తి వివరాలను అందిస్తారు. దీనిని పరిశీలించి వారు రిటైరయ్యే సమయానికి గ్రాట్యుటీ, వేతనం నుంచి నెలనెలా దాచుకున్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్(జీపీఎఫ్), గ్రూపు ఇన్సూరెన్స్(జీఎల్ఐ), కమ్యుటేషన్, సంపాదిత సెలవులు తదితరాలను లెక్కించి, ఆ మొత్తాన్ని సదరు విశ్రాంత ఉద్యోగి ఖాతాలలో జమ చేయాల్సి ఉంటుంది. ఉద్యోగుల హోదాను బట్టి, ఒక్కొక్కరికి రూ. 40 లక్షల నుంచి రూ. 70 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు దక్కుతుంది. విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపడానికి ఆ సొమ్ము ఎంతగానో ఉపయోగపడుతుంది.

గతేడాది మార్చి నుంచి..

ఒక్కో ఉద్యోగి దాదాపు మూడు దశాబ్దాలపాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తారు. గతంలో ఉద్యోగ విరమణ వయసు 58 ఏళ్లు ఉండగా గత ప్రభుత్వం 61 ఏళ్లకు పెంచింది. దీంతో ప్రతి ఉద్యోగికీ మూడేళ్ల సర్వీస్ పెరిగింది. మూడేళ్లపాటు రిటైర్మెంట్లు ఆగిపోయాయి. మళ్లీ గతేడాది మార్చిలో ఉద్యోగ విరమణలు మొదలయ్యాయి. ఇప్పటివరకు జిల్లాలో 2 వందల పైచిలుకు మంది రిటైరయ్యారు. అయితే ఏడాదిగా ఒక్కరికి కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందలేదు. ఎప్పుడు ఇస్తారన్న దానిపైనా స్పష్టత లేదు. గతంలో రిటైరైన రోజునే బెనిఫిట్స్ అందించడంతోపాటు పెన్షన్ సెటిల్ చేసేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో డబ్బులు లేవంటూ నయాపైసా ఇవ్వడం లేదు. ఉద్యోగ విరమణ పొంది ఏడాది గడిచినా ఎలాంటి బెనిఫిట్స్ అందకపోవడంతో చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు ఉద్యోగులు కోర్టును కూడా ఆశ్రయించారు. తమకు రావలసిన బెనిఫిట్స్ అన్నింటినీ ఏకకాలంలో చెల్లించాలని విన్నవించుకున్నారు. దీనిపై కోర్టు కూడా ప్రభుత్వానికి పలు సూచనలు చేసింది. ప్రభుత్వం వెంటనే తమకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు కల్పించాలని విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు కోరుతున్నారు.

ఎనిమిది నెలలుగా ఎదురుచూపులు..



పాల్వంచ మండలం సింగరాయపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి, గతేడాది జూన్ 30న రిటైరయ్యాను. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎనిమిది నెలలుగా ఎదురు చూస్తున్నాను. ప్రభుత్వం నుంచి సరైన స్పందన రావడం లేదు. మా డబ్బులు మాకు ఇవ్వడానికి ఇబ్బంది ఏమిటో అర్థం కావడం లేదు. ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయిలో చెల్లింపులు చేయాలి.

– ఆర్.మల్లేశం, రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్, కామారెడ్డి

అన్ని పత్రాలను సమర్పించినా..



రామారెడ్డి మండల కేంద్రంలోని గర్ల్స్ హైస్కూల్‌లో పీజీ హెడ్మాస్టర్‌గా పనిచేసి గతేడాది జూలై 31న పదవీ విరమణ పొందాను. ఇప్పటికీ బెనిఫిట్స్ అందించలేదు. మాకు రావలసిన డబ్బుల కోసం అన్ని పత్రాలను ప్రభుత్వానికి సమర్పించాం. మాకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం మావాళ్లు కొందరు కోర్టును ఆశ్రయించారు. అయినా సర్కారు స్పందించడం లేదు.

– కె.మురళి, రిటైర్డ్ పీజీ హెడ్మాస్టర్, కామారెడ్డి

జూనియర్ కాలేజీలకు లెక్చరర్లొచ్చారు!

- జిల్లాకు 52 మంది కేటాయింపు
- ప్రభుత్వ కళాశాలల్లో తీరనున్న సమస్య

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జూనియర్ లెక్చరర్ల నియామకంతో ప్రభుత్వ కాలేజీలు గాడిన పడనున్నాయి. ప్రభుత్వం ఇటీవల నియామక ప్రక్రియ చేపట్టింది. జూనియర్ లెక్చరర్లుగా ఎంపికైన వారికి ఈనెల 12న నియామక పత్రాలు అందించారు. కామారెడ్డి జిల్లాకు 52 మంది అలాట్ అయ్యారు. జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా 150 మంది అధ్యాపకులు ఉన్నారు. తాజాగా 52 మంది రావడంతో లెక్చరర్ల సంఖ్య 202 కు చేరింది.

జిల్లాలోని ప్రభుత్వ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడం కోసం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అనేక చర్యలు తీసుకున్నారు. అన్ని కాలేజీల్లో పేరెంట్స్ మీటింగ్స్ ఏర్పాటు చేసి, విద్యార్థులు గైర్హాజరు కాకుండా చర్యలు చేపట్టారు. అలాగే స్పెషల్ క్లాసులు, స్టడీ అవర్స్ నిర్వహించారు. తద్వారా విద్యార్థులు చదువు మీద దృష్టి సారించారు. అయితే జూనియర్ కళాశాలల్లో చాలాకాలంగా లెక్చరర్ల కొరత ఉంది. దీంతో బోధన సరిగా సాగక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయడంతో దాదాపు అన్ని కాలేజీల్లో అధ్యాపకుల కొరత తీరనుంది. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెరిగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

తూకంలో మోసం.. నాణ్యత ప్రశ్నార్థకం!



- పట్టించుకోని అధికారులు.. స్పందించని వినియోగదారులు
- నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

కామారెడ్డి అర్బన్: నాణ్యమైన వస్తువులు, సేవలను పొందడం వినియోగదారుల హక్కు. కానీ అంతటా నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. తూకాల్లో మోసాలుంటున్నాయి. కాదేదీ కల్తీకి, మోసానికి అనర్హం అన్నట్లుగా పరిస్థితి తయారయ్యింది. దీనికి అడ్డుకట్ట వేయాలంటే వినియోగదారులు మేల్కొవాల్సిన అవసరం ఉంది. కొన్ని సందర్భాలలో వినియోగదారులు ఎంత చైతన్యంగా ఉన్నా ఉత్పత్తిదారులు జిమ్మిక్కులు చేస్తూ మోసం చేస్తూనే ఉన్నారు. వినియోగదారులు, వ్యాపారుల హక్కులపై చైతన్యం చేసే యంత్రాంగం ప్రభుత్వం వద్ద లేదు. తూనికలు, కొలతలకు వేరుగా.. నాణ్యత ప్రమాణాలకు వేరుగా శాఖలు ఉండడం ఉత్పత్తిదారులకు అనుకూలంగా ఉంది. తూనికలు, కొలతల శాఖ అధికారులు ప్యాకింగ్‌పై పేర్కొన్న వివరాలను పరిశీలించడం మినహా ఇతర విషయాలు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. అలాగే ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు శాంపిళ్లను తీసుకుని నాణ్యతను నిర్ధారించడానికి ల్యాబ్‌కు పంపించాల్సి ఉంటుంది. అయితే ఆ శాఖకు జిల్లాలో అధికారి లేకపోవడంతో గమనార్హం. పండ్లు, కూరగాయలు, మాంసం, అంగళ్లలో అమ్మే వస్తువులతో నాణ్యత అంతంత మాత్రంగానే ఉంటోంది. వినియోగదారుల ప్రాణాలతో వ్యాపారులు చెలగాటమాడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

ప్రశ్నించేవారూ కరువే..

వినియోగదారులకు తమ హక్కులతో పాటు మోసాలు, వాటి నివారణ తదితర అంశాలపైనా సరైన అవగాహన లేదు. మోసాన్ని గుర్తించినా ప్రశ్నించేవారు తక్కువగానే ఉంటున్నారు. అలాగే మోసపోయామని తెలిసినప్పుడు ఎలా ముందుకు వెళ్లాలో తెలియక చాలామంది ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మోసాలు జరిగినప్పుడు ఏ చర్యలు తీసుకోవాలన్న అంశంపై వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

పట్టించుకునేవారు లేరు..



మురికి కాలువలు, చెత్త కుప్పల వద్ద తినుబండారాలు, కూరగాయలు అమ్ముతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆహార కల్తీపై తనిఖీలు నిర్వహించేవారు, చర్యలు తీసుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా సర్కారు మేల్కొని ఆహార కల్తీ జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– నర్సింలు, వినియోగదారుడు, కామారెడ్డి

మొక్కుబడి సమావేశాలే..



ప్రభుత్వం డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని, మార్చి 15 ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తోంది. వినియోగదారుల ఫోరాలు సైతం నామమాత్రం అయ్యాయి. పరిస్థితి మారాలి. వినియోగదారులను చైతన్యవంతులను చేయాలి.

– నారాయణ, వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

సర్కారు బడిలో 'కృత్రిమ మేధ'



అచ్చంపేట పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్

- 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఏఐతో బోధన
- నేడు అచ్చంపేటలో ప్రారంభించనున్న కలెక్టర్ సంగ్వాన్

నిజాంసాగర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు సర్కారు చర్యలు తీసుకుంటోంది. దీనికి కృత్రిమ మేధ సాయం తీసుకోవాలని నిర్ణయించిన సర్కారు.. మండలానికో పాఠశాలను ఎంపిక చేసింది. శనివారం ఏఐ సాయంతో విద్యాబోధనకు శ్రీకారం చుట్టనున్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు సర్కారు పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 3, 4, 5 తరగతులలో వెనకబడిన విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాయం తీసుకుంటోంది. మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేసి ఏఐ సాయంతో పాఠాలను బోధించడానికి చర్యలు తీసుకుంటోంది. శనివారం నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో కృత్రిమ మేధ సాయంతో బోధనను ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొంటారు. మిగతా మండలాల్లో ఈ కార్యక్రమానికి విద్యాశాఖ అధికారులు శ్రీకారం చుట్టనున్నారు. విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృత్రిమ మేధ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని భావిస్తున్నారు.

కస్టడీలోని యువకుడి మృతితో కలకలం

- పోలీసులు కొట్టడంతోనే మృతి చెందాడని కుటుంబీకుల ఆందోళన
- జీజీహెచ్ ఎదుట ధర్నా
- ఫస్ట్‌క్లాస్ జడ్జి సమక్షంలో పోస్టుమార్టం
- కార్డియాక్ అరెస్ట్‌తో మృతి చెందినట్లు ప్రకటించిన సీపీ సాయి చైతన్య

ఖలీల్‌వాడి : సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీలో ఉన్న యువకుడు మృతి చెందిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా అంతర్గాంలోని వడ్డెర కాలనీకి చెందిన అలకుంట సంపత్ (31) జగిత్యాల జిల్లాలోని శ్రీరామ ఇంటర్నేషనల్ మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. సంపత్‌తోపాటు జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రంగపేటకు చెందిన చిరంజీవి, ఇబ్రహీంపట్నం మండలం ఎర్రాపూర్‌కు చెందిన మిట్టపల్లి నర్సారెడ్డిలు పనిచేస్తున్నారు. విదేశాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురు నిరుద్యోగులు ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష వసూలు చేశారు. కొంతమందిని లావోస్ దేశానికి డేటాఎంట్రీ ఆపరేటర్ల పేరిట పంపించారు. తీరా అక్కడ సైబర్‌నేరాలు చేయించడంతో బాధితులు అక్కడి భారత రాయబార కార్యాలయంలో ఫిర్యాదు చేసి స్వదేశానికి తిరిగొచ్చారు. అనంతరం అలకుంట సంపత్, చిరంజీవి, నర్సారెడ్డిలపై జిల్లా కేంద్రంలోని సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ నెల 4న ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 12న కోర్టు అనుమతితో ముగ్గురు నిందితులను సైబర్ క్రైమ్ పోలీసులు కస్టడీలోకి తీసుకొని విచారణ నిమిత్తం జగిత్యాల జిల్లాకు తీసుకెళ్లారు. విచారణ అనంతరం జిల్లా కేంద్రంలోని సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా, గురువారం రాత్రి సంపత్ ఎడమ చేయి లాగుతోందని పోలీస్ సిబ్బందికి చెప్పడంతో వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలోనే ఫిట్స్ రావడంతో మృతి చెందినట్లు పోలీసులు చెబుతున్నారు. సంపత్ మృతి విషయాన్ని గురువారం అర్ధరాత్రి 12.30 గంటలకు తమకు చెప్పినట్టు కుటుంబీకులు తెలిపారు.



అలకుంట సంపత్ (ఫైల్)

ఫస్ట్‌క్లాస్ జడ్జి సమక్షంలో..

సంపత్ మృతదేహానికి ఫస్ట్‌క్లాస్ జడ్జి హరికృష్ణ సమక్షంలో ముగ్గురు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్టును సీపీ సాయిచైతన్యకు అందించారు. సంపత్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

గుండె సమస్యతో మృతి చెందాడు

'అలకుంట సంపత్ గుండె సంబంధిత సమస్యతోనే మృతి చెందాడు. సంపత్ శ్రీరామ ఇంటర్నేషనల్ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ ద్వారా నిరుద్యోగ యువతను థాయిలాండ్, మయన్మార్, లావోస్ తదితర ప్రాంతాలకు పంపించేవాడు. మోసపోయిన వారి ఫిర్యాదు మేరకు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. పోలీసులు గురువారం జగిత్యాలలోని సంపత్ కార్యాలయానికి తీసుకెళ్లి అక్కడ విచారణ చేశారు. అదే రోజు రాత్రి ఎడమ చేయి, ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో పోలీసులు జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. జీజీహెచ్‌లోని సీసీటీవీ ఫుటేజీలో సంపత్ నడుచుకుంటూ వెళ్లినట్లు గుర్తించాం. జీజీహెచ్‌కు వెళ్లిన తర్వాత సంపత్ కుప్పకూలిపోయాడు. వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. సంపత్ మృతిపై ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు అయ్యింది. విచారణ కొనసాగుతోంది.' అని సీపీ సాయి చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి

సంపత్ మృతి విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం జీజీహెచ్‌కు చేరుకున్నారు. పోలీసులు తీవ్రంగా కొట్టడంతోనే తన భర్త సంపత్ మృతి చెందాడని భార్య ఆరోపించారు. మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని జీజీహెచ్ ఎదుట ఉన్న రోడ్డుపై ధర్నా చేశారు. న్యాయం చేస్తామని, జడ్జి సమక్షంలో వీడియో రికార్డింగ్ ద్వారా పోస్టుమార్టం చేయించి, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యులు ధర్నా విరమించారు.

క్లుప్తంగా

కరెంట్ రావడం లేదని స్తంభం ఎక్కిన యువకుడు



విద్యుత్‌స్తంభం ఎక్కిన నర్సింలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తన ఇంట్లో కరెంట్ రావడంలేదనే కారణంతో మద్యంమత్తులో ఓ యువకుడు విద్యుత్‌స్తంభం ఎక్కిన ఘటన శుక్రవారం మండలంలోని తాండూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన చాకలి నర్సింలు అనే యువకుడు తన ఇంట్లో కరెంట్ రావడం లేదని, మద్యంమత్తులో విద్యుత్ స్తంభం ఎక్కాడు. స్తంభానికి విద్యుత్ సరఫరా ఉండటంతో స్థానికులు అతడిని ఎక్కవద్దని వారించారు. అయినా అతడు స్తంభం ఎక్కడంతో స్థానికులు వెంటనే విషయాన్ని సబ్‌స్టేషన్ సిబ్బందికి తెలియజేయడంతో వారు కరెంట్ నిలిపివేశారు. ఎంతసేపటికీ అతడు స్తంభం దిగకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి తన సిబ్బందితో గ్రామానికి చేరుకున్నాడు. పోలీసుల రాకను గుర్తించిన నర్సింలు స్తంభం దిగాడు. పోలీసుల ఎదుటే నర్సింలు వింతగా ప్రవర్తించడంతో అదుపులోకి తీసుకున్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



కామారెడ్డిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కామారెడ్డి క్రైం: మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకు సస్పెండ్ చేసినందుకు నిరసనగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎండగడుతూ మాట్లాడినందుకు మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డిని అక్రమంగా సస్పెండ్ చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పిప్పిరి ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, నాయకులు కుంబాల రవి యాదవ్, గోపిగౌడ్, గెరిగంటి లక్ష్మీనారాయణ, మల్లేష్ యాదవ్, భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..



ఎల్లారెడ్డిలో దహనం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జలంధర్‌రెడ్డి, సతీష్, అరవింద్, ఇమ్రాన్, బబ్లూ తదితరులున్నారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడులు

- 49 లీటర్ల మద్యం స్వాధీనం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామంలో నిర్వహిస్తున్న ఓ బెల్టు దుకాణంపై శుక్రవారం రాత్రి దేవునిపల్లి పోలీసులు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 49 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్టు షాప్ నిర్వహిస్తున్న కమ్మల మహేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి: మండలంలోని ఎల్లంపేటలో అక్రమంగా నిర్వహిస్తున్న ఇద్దరి బెల్టు షాపులపై శుక్రవారం దాడి చేసి రూ.9వేల విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఆరేపల్లి, బండ రామేశ్వరపల్లి గ్రామాల్లోని వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం సీజ్ చేసినట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యక్తుల గురించి తెలిస్తే డయల్ 100కు సమాచారాన్ని అందించాలని కోరారు.

అట్టహాసంగా హోలీ వేడుకలు







నగరంలోని ఉమామహేశ్వరభవన్‌లో హోలీ సంబురాలు జరుపుకుంటున్న యువతులు.. గోశాలలో భజనలు చేస్తూ పువ్వులు చల్లుకుంటున్న యువకులు

జిల్లాకేంద్రంలో శుక్రవారం హోలీ పండుగను ప్రజలు అట్టహాసంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరినొకరూ రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అలాగే పలుచోట్ల యువత, వివిధ సంఘాల సభ్యులు నృత్యాలు, కోలాటం, భజనలు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



బీజేపీ కార్యాలయం వద్ద బ్యాండ్ కొడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



రంగులు స్ప్రే చేస్తున్న మహిళలు



రంగులు స్ప్రే చేస్తున్న చిన్నారులు



నీళ్లు చల్లుతున్న యువతులు





నృత్యం చేస్తున్న యువకులు, మహిళలు



నృత్యం చేస్తున్న యువతులు



శ్రద్ధానందగంజ్‌లో కర్రలతో కోలాటం ఆడుతూ నృత్యాలు చేస్తున్న యువకులు

ఇందూరు తిరుమలలో వైభవంగా వసంతోత్సవం

మోపాల్: హోలీ పౌర్ణమి సందర్భంగా ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం నర్సింగపల్లిలో శుక్రవారం వసంతోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గోశాలలో జన్మించిన దూడకు రంగులు పూసి వసంతోత్సవాన్ని మొదలుపెట్టారు. అలాగే అర్చకులు ఒకరినొకరు రంగులు చల్లుకున్నారు.

ఉత్తర తిరుపతి క్షేత్రంలో..

నిజామాబాద్ రూరల్: నగరంలోని గంగాస్థాన్ ఫేజ్–2లోగల ఉత్తర తిరుపతి క్షేత్రంలో శుక్రవారం హోలీ పౌర్ణమి సందర్భంగా వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు రంగులు చల్లుకుంటూ హోలీ ఆడారు.



ఇందూరు తిరుమలలో స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు



ఉత్తర తిరుపతి క్షేత్రంలో..

రద్దీగా మటన్ దుకాణాలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో హోలీ సందర్భంగా మటన్ కొనేందుకు జనాలు భారీగా తరలివచ్చారు. పట్టణంలోని మటన్ మార్కెట్ జనాలతో కళకళలాడింది. మటన్ కోసం జనాలు అధికంగా రావడంతో ధరలను అమాంతం పెంచేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఎల్లారెడ్డిలో మటన్ కొనేందుకు బారులు తీరిన జనాలు

హున్సాలో పిడిగుద్దులాట



పిడిగుద్దులాటలో పాల్గొన్న హున్సా గ్రామస్తులు



కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

బోధన్: వందేళ్ల క్రితం నాటి నుంచి హోలీ సందర్భంగా హున్సా గ్రామంలో నిర్వహిస్తున్న పిడిగుద్దులాట ఆఖరికి ఆనవాయితీ ప్రకారం కొనసాగింది. పోలీసులు ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఆట కొనసాగింపుపై సందిగ్ధత నెలకొనగా, ఆఖరుకు ప్రజాప్రతినిధులు, కుల సంఘాల పెద్దలు పోలీసులను ఒప్పించారు. దీంతో సాలూర మండలంలోని హున్సా గ్రామంలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజలు రంగులు చల్లుకుంటూ హోలీ జరుపుకున్నారు. సాయంత్రం గ్రామ శివారులో కుస్తీ పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద గ్రామస్తులు పిడిగుద్దులాటకు సిద్ధమయ్యారు. గ్రామ పెద్దలు కర్ర స్తంభాలు పాతి, బలమైన తాడును బిగించారు. తాడుకు ఇరువైపులా గ్రామస్తులు ఉండగా గ్రామ పెద్దల సూచన మేరకు ఆట మొదలు పెట్టారు. కుడి చేతితో తాడును పట్టుకుని ఎడమ చేతి పిడికిలితో ఒకొరినొకరు కొట్టుకున్నారు. పదినిమిషాల అనంతరం గ్రామపెద్దలు తాడును వదిలివేయడం ఆట ముగిసింది. అనంతరం ఇరువైపుల వారు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రూరల్ సీఐ విజయబాబు, ఎస్సై మచ్చేందర్ రెడ్డి పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు.

క్రైం కార్నర్

పండుగ పూట విషాదం

- ఆటోను ఢీకొన్న లారీ
- ఆటో డ్రైవర్, ప్రయాణికురాలు మృతి
- పలువురికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

కామారెడ్డి క్రైం: సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామంలో పండుగ పూట విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తోపాటు ఓ ప్రయాణికురాలు మృతిచెందడంతో గ్రామస్తులు తీవ్ర విషాదానికి గురయ్యారు. వివరాలు ఇలా.. సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అంకం నరేందర్ (65) శుక్రవారం కామారెడ్డిలో ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకొని కుప్రియాల్‌కు బయలు దేరాడు. టేక్రియాల్ వద్దగల జాతీయ రహదారిపై వీరి ఆటోను తమిళనాడుకు చెందిన లారీ వెనుకనుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటో పల్టీలు కొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న సమీప గ్రామాలకు చెందిన లక్ష్మణ్, నింబాయిగారి లక్ష్మి, సమీనా, పకీర అబ్దుల్, ఎస్‌కే ఉస్మాన్‌లతో పాటు సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామానికి చెందిన కుమ్మరి నర్సవ్వ (70), ఆటో డ్రైవర్ అంకం నరేందర్ (65)లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానికులు, పోలీసులు కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే ఆటో డ్రైవర్ నరేందర్ మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో నర్సవ్వను నిజామాబాద్ జనరల్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. నర్సవ్వ అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రమాదంలో ఒకే రోజు ఇద్దరు గ్రామస్తులు మృతి చెందటంతో కుప్రియాల్‌లో విషాదఛాయలు అలముకున్నాయి.

అదృశ్యమైన వ్యక్తి శవమై తేలాడు



పెద్ద భోజన్న (ఫైల్)

మాక్లూర్: మండలానికి చెందిన ఓ వ్యక్తి ఈనెల 13న అదృశ్యమవగా, శుక్రవారం వాగులో శవమై తేలాడు. మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని గుంజ్లి గ్రామానికి చెందిన గోపు పెద్ద భోజన్న (55) గురువారం ఉదయం పొలానికి వెళ్లగా, రాత్రయినా తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంతవెతికినా అతడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు ఉదయం స్థానిక వ్యవసాయ బోరుబావి వద్దగల వాగులో శవమై తేలాడు. వెంటనే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడు చేపలు పట్టడానికి వాగులోకి దిగాడా? లేక వ్యవసాయ మోటార్‌కు రిపేర్ చేయడానికి వాగులో దిగి, ప్రమాదవశాత్తు మృతి చెందాడా అనేది తెలియాల్సి ఉందన్నారు. ఈమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని తల్వేద గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను స్థానిక పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. అంతకుముందు తల్వేద గ్రామ శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. అనంతరం గ్రామంలో నిల్వ ఉంచిన సుమారు 20 ట్రిప్పుల ఇసుక డంపులను రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేశారు. ట్రాక్టర్ డ్రైవర్ సురేష్‌తోపాటు ట్రాక్టర్ యజమాని సంటోళ్ల సాయరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

అదుపుతప్పి బ్రిడ్జి కిందకు దూసుకెళ్లిన కారు



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారి వద్ద ఉన్న టోల్‌గేట్‌ను తప్పించుకునేందుకు దారిని మార్చుకుని వెళ్తున్న కారు అదుపుతప్పి బ్రిడ్జి కిందికి దూసుకెళ్లింది. వివరాలు ఇలా.. హైదరాబాద్‌కు చెందిన ఒక కుటుంబం కారులో బాసరకు బయలుదేరారు. భిక్కనూరు వద్ద టోల్ తప్పించుకునేందుకు జాతీయ రహదారిని వదిలి భిక్కనూరు వచ్చి అంతంపల్లి మీదుగా వెళ్లారు. ఈక్రమంలో కారు అదుపుతప్పి బ్రిడ్జి కిందికి వెళ్లింది. సమీపంలో ఎవరూ లేకపోవడంతో వారు డయల్ 100కు సమాచారం అందించారు. వెంటనే భిక్కనూరు పోలీసులు, ఫైర్ ఇంజిన్ సిబ్బంది అక్కడికి చేరుకుని కారును పైకి తీసుకవచ్చారు. టోల్ తప్పించుకునేందుకు ఇలా అడ్డదారిలో వెళ్లడంపై అధికారులు వారిని మందలించారు. అనంతరం సదరు కుటుంబం అదే కారులో బాసరకు వెళ్లారు.

కుటుంబ విషయాల్లో అడ్డొస్తుందని తల్లి హత్య

- భర్తతో కలిసి ఘాతుకానికి పాల్పడ్డ కూతురు
- పోలీసుల అదుపులో నిందితులు
- వివరాలు వెల్లడించిన నార్త్ సీఐ శ్రీనివాస్



వివరాలు వెల్లడిస్తున్న నార్త్ సీఐ శ్రీనివాస్

ఖలీల్‌వాడి: కన్న తల్లిని కట్టుకున్న భర్తతో కడతేర్చింది ఓ కూతురు. ఈ ఘటనలో దంపతులిద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని నార్త్ సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. నాగారం 300క్వార్టర్స్‌లో రమేష్, సౌందర్య అనే దంపతులు నివసిస్తున్నారు. సౌందర్య తల్లి విజయలక్ష్మి నాలుగు సంవత్సరాలుగా వీరివద్దనే ఉంటోంది. ఈక్రమంలో విజయలక్ష్మీ తరుచూ ఇంటి విషయాల్లో జోక్యం చేసుకోవడంతో కూతురు, అల్లుడికి ఇబ్బందిగా మారింది. దీంతో ఆమె అడ్డు తొలగించుకోవాలని భావించి బుధవారం రాత్రి విజయలక్ష్మి పడుకోగానే దంపతులు ఇద్దరు కలిసి ఆమె ముఖంపై దిండుపెట్టి ఊపిరి ఆడకుండా చేసి, చేతితో గొంతు పిసికి చంపారు. సహజ మరణంగా నమ్మించడానికి యత్నించగా, అనుమానం వచ్చి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విచారణలో వారు నేరం అంగీకరించడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై గంగాధర్, సిబ్బంది ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది



వివరాలు సేకరిస్తున్న అధికారులు

రుద్రూర్: మండలంలోని అంబం (ఆర్) గ్రామంలో శుక్రవారం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి రెండు నివాసపు గృహాలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన లక్ష్మీ, సావిత్రిలు తమ ఇళ్లల్లో ఒంటరిగానే ఉంటున్నారు. హోలీ సందర్భంగా వారు బయటకు వెళ్లిన సమయంలో ఆయా ఇళ్లల్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. స్థానికులు గమనించి బోధన్ ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించగా, వారు గ్రామానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లోని బంగారం, వెండి ఆభరణాలు, డబ్బులు కాలిపోయాయని బాధితులు తెలిపారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భారతి, తహసీల్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ భూషన్ ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఒక్కొక్కరి ఇంటిలో సుమారు రూ. లక్షా 50వేలు ఆస్తి నష్టం జరిగినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. బాధితులకు ప్రభుత్వం సహాయాన్ని అందించాలని గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు.